ఉపాధిమార్గం ఉచితం

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శిక్షణ
- కుట్టు శిక్షణ తోపాటు బ్యుటీషియన్ కోర్సు
- ఉచితంగానే శిక్షణ, అనంతరం సర్టిఫికెట్



టైలరింగ్ మెళుకువలు నేర్చుకుంటున్న యువతులు

తంగళ్లపల్లి: మహిళలు కుల వృత్తులు, కూలి పనులకు వెళ్లి తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గలపై సరైన అవగాహన, శిక్షణ లేకపోవడంతో వారు సాంప్రదాయ వృత్తులను కొనసాగిస్తూ చాలీచాలని వేతనాలతో జీవితాలు వెళ్లదీస్తున్నారు. అలాంటి మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఐసీడీఎస్ అధికారులు శ్రీకారం చుట్టారు. కుల వృత్తులు, కూలి పనులు చేయదం, బీడీలు చుదుతున్న మహిళలకు కుట్టు మిషన్, బ్యుటిషియన్ కోర్సుల ద్వారా నైపుణ్యాన్ని అందించి వారి జీవన విధానాన్ని మెరుగు పరిచేందుకు అవకాశాన్ని తోడ్పాటును అందిస్తున్నారు.

45 రోజులపాటు రోజుకు మూడు గంటలు

తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు 30 గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరాలను ప్రారంభించారు. ఈ శిక్షణలో మహిళలకు, యువతులకు కుట్టు మిషన్ శిక్షణ, బ్యూటీషియన్ కోర్సులు 45 రోజులపాటు అందివనున్నారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కోర్సును నిష్ణాతులైన ట్రైనర్ల ద్వారా అందిస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఈ కోర్సులకు శిక్షణ ప్రారంభమైంది. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలోనే శిక్షణ శిబిరాన్ని ఎంపీపీ పడిగెల మానస ఇటీవల ప్రారంభించగా విజయవంతంగా కొనసాగుతోంది.

ఉచితంగానే శిక్షణ సర్టిఫికెట్

కుట్టు మిషన్, బ్యూటీషన్ కోర్సులు చేయాలనుకుంటే ప్రైవేట్ ట్రైనర్లు ఒక్కో కోర్సుకు సుమారుగా రూ.10 వేల వరకు ఫీజు తీసుకుంటున్నారు. కాగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ కోర్సులను మహిళలు, యువతులకు ఉచితంగానే అందిస్తున్నారు. శిక్షణ ముగిసిన అనంతరం వారికి కోర్సు సర్టిఫికెట్ కూడా అందిస్తారు. వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, యువతులు ఈ కోర్సులను సద్వినియోగం చేసుకుని మెరుగైన ఉపాధిని పొందాలని ఐసీడీఎస్ అధికారులు కోరుతున్నారు.



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు వెంగళ రమ్యశ్రీ తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీడీలు చుదుతూ జీవిస్తోంది. ప్రస్తుతం ఐసీడీఎస్ ఉచిత కుట్టు మిషన్ కోర్సు శిక్షణ తీసుకుంటోంది. బీడీలు చుదితే నెలకు రూ.2 వేలు వచ్చేవని. కానీ టైలరింగ్ కోర్సు ద్వారా రూ.5 వేలకు పైగా సంపాదించే వీలు ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఇలాగే ఎందరో మహిళలు తమ భవిష్యత్తును బాగుచేసుకునేందుకు ఈ కోర్సులో చేరారు.

టైలరింగ్‌తో మంచి ఉపాధి



మహిళలు టైలరింగ్ నేర్చుకోవడం వలన మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయి. ఇంటి పట్టునే ఉంటూ ఉపాధి పొందేందుకు వీలుంది. శిక్షణలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ మెళుకువలు నేర్పుతున్నారు.
– అత్రి శైలజ, టైలరింగ్ కోర్సు

ఉచితంగా ఖరీదైన కోర్సు



బయట బ్యూటీషియన్ కోర్సు నేర్చుకోవాలంటే రూ.10 వేలకు పైగానే ఫీజు చెల్లించాల్సి ఉంది. మళ్లీ దూరప్రాంతాలకు వెళ్లి కోర్సు నేర్చుకోవాలి. ఐసీడీఎస్ వారు సహకారంతోఉచితంగా ఊర్లోనే నేర్చుకుంటున్న.
– డి.వెన్నెల, బ్యూటీషియన్ కోర్సు

పూర్తిస్థాయిలో శిక్షణ



కుట్టు మిషన్, బ్యుటీషియన్ కోర్సుల్లో చేరిన మహిళలు, యువతులకు పూర్తిస్థాయిలో 45 రోజుల పాటు శిక్షణ ఇస్తాం. రోజూ 3 గంటల చొప్పున శిక్షణ ఇస్తున్నాం. దీంతో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి.
– రాపెల్లి శైలజ, టైలరింగ్ టీచర్

స్పందన బాగుంది



ఈ కోర్సులకు మహిళలు, యువతుల నుంచి స్పందన బాగుంది. తంగళ్లపల్లిలో 31 మంది మహిళలు దరఖాస్తు చేసుకోగా శిక్షణ ప్రారంభమైంది. మిగతా 29 గ్రామాల్లో కూడా శిక్షణ అందివ్వనున్నాం.
– పడిగెల మానస, ఎంపీపీ తంగళ్లపల్లి

క్లుప్తంగా

నాణ్యమైన వైద్య సేవలందించాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, అధికారులు

కోనరావుపేట: ఆస్పత్రికి వచ్చే వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో ఉన్న సమస్యల గురించి, వాటిని ఎలా పరిష్కరించుకోవాలన్న విషయాలపై చర్చించారు. ఆరోగ్య కేంద్రంలో ఇంకా కావాల్సిన అవసరాలు, పరికరాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయని, అన్ని గ్రామాల ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. తహసీల్దార్ రవికాంత్, ఎంపీడీవో రామకృష్ణ, వైద్యాధికారి వేణుమాదవ్, ఎంపీటీసీ నర్సింహచారి పాల్గొన్నారు.

రాళ్లపేటలో భూసార పరీక్షలు



భూసార పరీక్షలు నిర్వహిస్తున్న విద్యార్థులు

తంగళ్లపల్లి: మండలంలోని రాళ్లపేట గ్రామంలో శుక్రవారం జిల్లెల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో వ్యవసాయ క్షేత్రాల్లో భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డా.భారతి మాట్లాడుతూ రైతులందరూ భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని భూమి హెల్త్‌కార్డు ప్రకారం సూచించిన ఎరువులను వాడాలని కోరారు. అనంతరం రైతులకు జీలుగ, జనుము విత్తనాలను అందజేశారు. సర్పంచ్ పరుశరాములు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశీలించిన రీజనల్ జాయింట్ డైరెక్టర్



పుస్తకం రచించిన విద్యార్థులతో ఆర్జేడీ

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని గీతానగర్, శివనగర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలను వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి శుక్రవారం సందర్శించారు. 'మన ఊరు–మన బడి', గివ్ తెలంగాణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న నిర్మాణాలను పరిశీలించారు. అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఉండటాన్ని ప్రశంసిస్తూ అందుకు గల కారణాలను తెలుసుకున్నారు. ఇటీవల సిరిమల్లె పుస్తకాన్ని శివనగర్ పాఠశాల విద్యార్థులు రచించగా మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పుస్తకాన్ని రచించిన విద్యార్థుల బృందాన్ని అభినందించారు. లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్స్, సైన్స్ ల్యాబ్, డైనింగ్‌హాల్‌ను పరిశీలించారు. డీఈవో రమేశ్‌కుమార్, ఎంఈవో రఘుపతి, నాగుల భాగ్యరేఖ, శ్రీధర్, దేవదాసు పాల్గొన్నారు.

పారిశుధ్య ప్రణాళికను విజయవంతం చేయాలి

- మండల ప్రత్యేకాధికారి, డీటీవో కొండల్‌రావు



పనులను పరిశీలిస్తున్న కొండల్‌రావు

కోనరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17–23 వరకు చేపడుతున్న ప్రత్యేక పారిశుధ్య ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి, డీటీవో కొండల్‌రావు కోరారు. కోనరావుపేటలో జరుగుతున్న పారిశుధ్య పనులను శుక్రవారం పరిశీలించారు. గ్రామంలోని వీధులు తిరుగుతూ చేస్తున్న పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలన్నీ పచ్చదనం, పరిశుభ్రతతో ఉండాలన్న ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ ఆదేశాలతో ప్రత్యేక పారిశుధ్యం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పారిశుధ్యం పనుల్లో బాగంగా ప్రతి శుక్రవారం డ్రై డే తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇళ్లలోని పాత్రల్లో, కుండీల్లో, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇళ్ల సమీపంలో చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోకల రేఖ, ఎంపీటీసీ నర్సింహచారి, కార్యదర్శి సాయికృష్ణ, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె



వేములవాడరూరల్/చందుర్తి: ఐకేపీ వీవోఏలు చేపడుతున్న నిరసన శుక్రవారం 14వ రోజుకు చేరింది. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన వీవోఏలు నిరసనలో పాల్గొన్నారు. చందుర్తిలో వీవోల సంఘం మండల అధ్యక్షురాలు స్వరూప, వీవోఏలు వినోద, మమత, పద్మ, స్వప్న, రేణుక, గంగ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ముస్తాబాద్: ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు ఆర్జించే విధంగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఏఈవో ప్రదీప్ అన్నారు. ఆవునూర్ రైతువేదికలో శుక్రవారం అవగాహన కల్పించారు.

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ పడిగెల మానస, సర్పంచులు అనిత, ఉమ, సిరిసిల్ల సింగిల్‌విండో వైస్‌చైర్మన్ రమణారెడ్డి, హార్టికల్చర్ అధికారి స్రవంతి, ఏఈవో కరుణాకర్, జాగృతి మండల అధ్యక్షుడు రామాగౌడ్, రైతులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలం సుద్దాలలోని రైతు వేదికలో ఆయిల్‌పామ్ చేస్తున్న రైతులను సన్మానించారు. సర్పంచ్ దేవలక్ష్మి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కాశవేణి మహేశ్, హార్టికల్చర్ క్లస్టర్ అధికారి అరవింద్, ఏఈవో నరేశ్, సుద్దాల రైతులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్ రైతు వేదికలో నిర్వహించిన సదస్సులో ఏఈవో శిరీష, సతీశ్, కార్తీక్ పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని మూడపల్లి రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగు అవగాహన సదస్సులో ఆయిల్‌పామ్ సదస్సు ఇన్‌చార్జి శేఖర్, సర్పంచ్ అంజిబాబు, రైతుబంధు జిల్లా సభ్యులు బొప్ప వెంకన్న, క్లస్టర్ ఇన్‌చార్జీ సంటి బాపురావు, వ్యవసాయ శాఖ ఏఈవో శిరీషా పాల్గొన్నారు.

సిరిసిల్లఅర్బన్: ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ పెట్టుబడి దీర్ఘకాలిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వి.భాస్కర్ తెలిపారు. ఆయిల్ పామ్‌కు డిమాండ్ ఉందని, నేరుగా కంపెనీలు కొనుగోలు చేస్తాయని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ లభిస్తుందన్నారు.

పనికి తగ్గ వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న జంగం అంజయ్య

వీర్నపల్లి: ఉపాధిహామీ కూలీలకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని సీపీఐ రైతు విభాగం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య పేర్కొన్నారు. వీర్నపల్లిలోని వెంకట్రాయినిచెరువులో ఉపాధిహామీ పనులను శుక్రవారం పరిశీలించారు. వేతనాలు సకాలంలో చెల్లించడం లేదన్నారు. కూలీలకు నీటి, నీడ సౌకర్యం కల్పించడం లేదన్నారు. పనికి తగ్గ వేతనం అందడం లేదని కూలీలు నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో నరేశ్‌కుమార్, సాంకేతిక సహాయకుడు నాగరాజు కూలీలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అవగాహన కల్పించి పనులు జరిగేలా చూస్తామన్నారు. డబ్బులు రాని కూలీలు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఎండలో పనిచేసే కూలీలకు నీడను ఏర్పాటు చేస్తామన్నారు.

స్కాలర్‌షిప్‌లకు ఎంపిక

ముస్తాబాద్/బోయినపల్లి: జాతీయ ప్రతిభాన్వేషణ ఉపకార వేతన పరీక్షలో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులకు ఇంటర్ పూర్తయ్యే వరకు సంవత్సరానికి రూ.12 వేల ఉపకార వేతనం ప్రతి సంవత్సరం అందుతుందని తెలిపారు. మండలంలోని నామాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు ముస్తాబాద్‌కు చెందిన సుతారి శృతి, రాజక్కపేటకు చెందిన పడిగె లిఖిత ఎంపికయ్యారని ప్రిన్సిపల్ అరుణ్‌కుమార్ తెలిపారు. అలాగే బోయినపల్లి మండలంలోని కొదురుపాక హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులు వి.రేఖ, వి.కీర్తన, కె.ప్రవన్‌కుమార్, ఎం.శ్రీజ నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయినట్లు ప్రధానోపాధ్యాయుడు రంగనాథశర్మ తెలిపారు. జిల్లాలో మొదటి ఐదు స్థానాల్లో కొదురుపాక హైస్కూల్ విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి

తంగళ్లపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలను పెంచి వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం జిల్లా నాయకుడు సోమ నాగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని బస్వాపూర్‌లో శుక్రవారం మాట్లాడుతూ దేశంలో 20 ఉత్తమ గ్రామ పంచాయతీలు ఎన్నికైతే వాటిలో 19 తెలంగాణలోనే ఉన్నాయని తెలిపారు. కార్మికుల కృషితోనే ఉత్తమ గ్రామాలుగా అభివృద్ధి చెందాయన్నారు. నాయకులు వడ్డేపల్లి లక్ష్మణ్, రామస్వామి, బూదక్క పాల్గొన్నారు.

భవనాలు ఎప్పుడు నిర్మిస్తారో.?

- నిర్మాణం కాని పంచాయతీ భవనాలు
- ఇరుకు గదుల్లోనే విధులు
- పట్టించుకోని పాలకులు



ఈ ఫొటోలో కనిపించేది.. తుర్కాషినగర్ పంచాయతీ కార్యాయలయం. ఈ భవనంలో ఒక పక్క గ్రామ పంచాయతీ భవనం, మరో పక్క అంగన్‌వాడీ సెంటర్ ఉంది. కొత్తగా ఏర్పడిన ఈ పంచాయతీకి ప్రభుత్వం భవనం మంజూరు చేసింది. కానీ స్థల కొరతతో ఇప్పటి వరకు భవనాన్ని ప్రారంభించలేదు. ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజూరు చేసినా నిర్మాణం మాత్రం జరగడం లేదు.



లింగంపల్లిలో చివరిదశకు వచ్చిన నూతన గ్రామ పంచాయతీ భవనం

వేములవాడరూరల్: మండలంలోని 17 గ్రామాల్లో నాలుగు గ్రామాలకు నూతన గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించుకునేందుకు రూ.20 లక్షల చొప్పున అనుమతులు ఇచ్చారు. వీటిలో లింగంపల్లి, బాలరాజుపల్లి, నమిలిగుండుపల్లి, తుర్కాషినగర్ గ్రామాలున్నాయి. దాదాపు మూడు నెలలు గడిచినా ఇప్పటి వరకు లింగంపల్లి గ్రామంలో తప్ప ఎక్కడ పనులు ప్రారంభించలేదు. లింగంపల్లి గ్రామంలో దాదాపు 80 శాతం పనులు కూడా పూర్తి కావస్తున్నా మూడు గ్రామాల్లో మాత్రం ఇప్పటివరకు ఎలాంటి పనులు జరగడం లేదు. బాలరాజుపల్లి గ్రామంలో మాత్రం భూమిపూజ చేసి వదిలిపెట్టారు. తుర్కాషినగర్ గ్రామంలో స్థలం కొరత ఉండగా నమిలిగుండుపల్లి గ్రామంలో మాత్రం పాత గ్రామ పంచాయతీ పరిధిలోనే నిర్మించేందుకు పాలకవర్గ సభ్యులు తీర్మానించారే తప్ప ఇప్పటి వరకు భూమిపూజ చేయలేదు. మూడు నెలల్లో పనులు పూర్తిచేయాలని అధికారులు చెప్పినా పాలకులు మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనపడడం లేదు. ఇరుకు గదులు, అద్దె భవనాల్లో మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. కాని నిర్మాణాలు చేసుకోవడంలో పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

దగ్గరపడుతున్న పదవీకాలం

గ్రామ సర్పంచులుగా బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయినా మరికొన్ని నెలలే పదవీకాలం ఉంది. వారి పదవీకాలంలో నూతన గ్రామ పంచాయతీలకు అన్ని హంగులతో భవనం నిర్మించాలని అనుమతుల కోసం ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఇందులో భాగంగానే నాలుగు గ్రామ పంచాయతీలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. కానీ ఇప్పటి వరకు మాత్రం పనులు ప్రారంభించ లేదు. మరికొద్ది నెలలే పదవీకాలం ఉన్నందున భవనాలు నిర్మిస్తే ప్రభుత్వం నుంచి బిల్లులు వస్తాయో రావో అనే ఆందోళనలో సర్పంచులు వెనుకడుగు వేస్తున్నట్లు కూడా తెలిసింది. ఏదిఏమైనా పంచాయతీ భవనాలు నిర్మాణం చేయడంలో సర్పంచులు నిరాసక్తత వ్యక్తం చేస్తున్నట్లు కనబడుతోంది.

నెల రోజుల్లో పూర్తిచేస్తాం



మాకు ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంజూరు చేసింది. వెంటనే పనులు ప్రారంభించాం. ప్రస్తుతం 80 శాతం వరకు పనులు జరిగాయి. మరో నెల రోజుల్లో పూర్తి చేస్తాం.
– సామ కవిత, సర్పంచ్, లింగంపల్లి

స్థలం ఫైనలయ్యింది



మా గ్రామంలో ప్రభుత్వ స్థలం కొరత ఉండడంతో పనులు ప్రారంభించలేదు. ఇప్పుడు స్థలం ఫైనలయ్యింది. పనులు ప్రారంభించేలా చూస్తాం. అందరికీ అందుబాటులో ఉండేలా నిర్మిస్తాం.
– ఎస్‌కె రిజ్వానా, సర్పంచ్, తుర్కాషినగర్

పనులు ప్రారంభించాలి



సర్పంచులకు భవన నిర్మాణం పనులు ప్రారంభించాలని చెప్పాం. ఒక లింగంపల్లిలో 80 శాతం పూర్తయ్యింది. మిగతా గ్రామాల్లో కూడా పనులు ప్రారంభించాలి.
– రాంరెడ్డి, ఎంపీడీవో, వేములవాడరూరల్

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇల్లంతకుంట: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ హారిక తెలిపారు.

సమాచారం

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: ఉపాధి కల్పించే పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోసి, బ్యాగ్స్ తయారీ వంటి కోర్సుల్లో ఆరు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు వసతి సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. కనీసం 8వ తరగతి పాసైన నిరుద్యోగ యువత తమ ఆసక్తిని తెలియపరుస్తూ పూర్తి చేసిన దరఖాస్తులను యాదాద్రి భువనగిరి జిల్లా జలాల్‌పూర్ లోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 29న ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 91824 05414 సెల్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

కనులపండువగా కల్యాణం



చందుర్తి: మండలం మల్యాల గ్రామంలోని శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో సొడలమ్మ కల్యాణం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. సర్పంచ్ గట్టు లక్ష్మీనారాయణ, టీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, బీజేపీ జిల్లా నాయకులు అల్లాడి రమేశ్, అధ్యక్షుడు మోతుకుపల్లి గణేశ్, కొట్టే కిష్టయ్య, పాటి సుధాకర్, బొడ్డు కృష్ణ, పత్తిపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



వీర్నపల్లి: విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్‌ల డిమాండ్లు పరిష్కరించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. మండల విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

సిరిసిల్లకల్చరల్: జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ తరపున అర్హులైన వారికి మంజూరైన పలు పరికరాల విషయంలో అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఆ శాఖ జిల్లా అధికారి లక్ష్మీరాజం కోరారు. ఎంపికైన వారిలో తగిన అర్హతలు లేవని భావించిన పక్షంలో తగిన ఆధారాలతో ఈ నెల 14లోపు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో అభ్యంతరాలను తెలియజేయాలన్నారు.

కళాకారుల కన్వీనర్‌గా నారాయణ

సిరిసిల్లఅర్బన్: జిల్లా సాంస్కృతిక నృత్య కళానికేతన్ కార్యాలయంలో సిరిసిల్ల అర్బన్ కళాకారుల కన్వీనర్‌గా బొడ్డు నారాయణ, కో– కన్వీనర్‌గా లాల శ్రీనివాస్ శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిరిసిల్లరూరల్ మండల కన్వీనర్‌గా కొక్కుల రాజేశం, కో–కన్వీనర్‌గా భాగయ్యను ఎన్నుకున్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండలం రాజన్నపేట, రాచర్లగొల్లపల్లి గ్రామాల్లో కుట్టుశిక్షణ, బ్యుటీషియన్‌పై శిక్షణ కార్య్యక్రమాలను ఐసీడీఏస్ సూపర్‌వైజర్ కళావతి, సర్పంచులు శంకర్, సరోజన ప్రారంభించారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం కమ్యూనిటీ భవనంలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ ఉరడి రాంరెడ్డి ప్రారంభించారు.

జీలుగ విత్తనాలు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట సింగిల్‌విండో గోదాంలో రైతులకు శుక్రవారం 65 శాతం సబ్సిడీపై ఇచ్చే జీలుగ విత్తనాలను ఎంపీపీ పిల్లి రేణుక, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి పిణీ చేశారు. డైరెక్టర్లు వెంకటనర్సింహారెడ్డి, రాంచంద్రారెడ్డి, సతీష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఏఈవో లక్ష్మణ్, సీఈవో కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి గ్రామంలో మండల స్థాయి యువజన కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రవీణ్ హాజరయ్యారు.

వేములవాడలో 5జీ సేవలు

వేములవాడ: వేములవాడ పట్టణ ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు జియో 5జీ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు కంపెనీ మేనేజర్ నాగేంద్ర శుక్రవారం తెలిపారు.